## మహిళలకు ఐడీ కార్డు తప్పనిసరి

ఖలీల్‌వాడి, డిసెంబర్ 14 : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయాలంటే తమ ఐడీ కార్డును తప్పనిసరిగా చూపించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్, ఓటరు, డ్రైవింగ్ లైసెన్స్ లేదా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## రేపు క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ క్రీడాకారుల ఎంపిక

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 14 : నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ కోసం బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని నాగారాంలో ఉన్న రాజారాం స్టేడియంలో ఈ నెల 16వ తేదీన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 23వ తేదీన కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9989040776 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## నేడు చందూర్ మండల సర్వసభ్య సమావేశం

చందూర్, డిసెంబర్ 14 : మండలకేంద్రంలో ఎంపీపీ లావణ్య అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నీలావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## మొరం తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి, డిసెంబర్ 14 : అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. మండల సమీపంలోని రాంపూర్ గుట్ట ప్రాంతంలో అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతుండగా దాడులు చేసి, మొరం తరలిస్తున్న టిప్పర్‌తోపాటు రెండు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను తహసీల్ కార్యాలయంలో ఉంచామని పేర్కొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 14 : మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి గురువారం ఆర్థిక సాయం చేశారు. తమతో కలిసి చదువుకున్న సుజాత గతంలో, తన భర్త ఇటీవల మరణించడంతో వారి ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. దీంతో పూర్వ విద్యార్థులు బాధితులకు రూ.18వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రమేశ్, గంగాధర్, సుమలత, ప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విశ్రాంత ఉద్యోగుల క్రీడా పోటీలు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 14 : జిల్లాస్థాయి విశ్రాంత ఉద్యోగుల క్రీడాపోటీలను నేటి (శుక్రవారం) నుంచి ఈనెల 17 వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మామిడాల రవీందర్, ప్రధానకార్యదర్శి పడాల భోజాగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరై పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

## ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

సిరికొండ, డిసెంబర్ 14 : 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్‌రావు తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో స్పెషల్ సమ్మరి రివిజన్ -2024లో భాగంగా జనవరి 1, 2024 నాటికి 18 ఏండ్లు నిండిన వారు, ఓటరుకార్డులో మార్పులు చేర్పుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

ఇందల్వాయి, డిసెంబర్ 14 : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డిచ్‌పల్లి పోలీసులు సూచించారు. మండలంలోని సుద్దపల్లి పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైం, రోడ్డు భద్రతా నియమాలు, షీ టీముల పతినీరు తదితర అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పోలీసుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో సపోస్ క్రిస్మస్ వేడుకలు

### ఆకట్టుకున్న ఏసుక్రీస్తు జనన నాటక ప్రదర్శన

ఖలీల్‌వాడి, డిసెంబర్ 14 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సపోస్ క్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ ఆధ్వర్యంలో దవాఖానలోని కాన్ఫరెన్స్ హాలులో వేడుకలను నిర్వహించారు. దవాఖాన సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతానికి సంబంధించిన రూపకాన్ని ప్రదర్శించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సీఎస్‌ఐ చర్చి బృందం.. దవాఖాన సిబ్బందితో కలిసి సంగీత వాయిద్యాలతో క్రిస్మస్ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, జాన్ సుకుమార్, నర్సింగ్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న దవాఖాన అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

## స్నేహా సొసైటీలో ఆటల పోటీలు



క్యారం ఆడుతున్న దివ్యాంగ విద్యార్థులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 14 : జిల్లా కేంద్రంలోని స్నేహా సొసైటీలో జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శిశు, సంక్షేమ శాఖ అధికారిణి రసూల్‌బీ హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, దివ్యాంగులు, పీఈటీ, సిబ్బంది పాల్గొన్నారు.

## జల్లాపల్లిలో పులి సంచారంపై భయాందోళన

### ఆనవాళ్లు లేవని స్పష్టం చేసిన అటవీశాఖ అధికారులు



కొడిచెర్ల శివారు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కోటగిరి, డిసెంబర్ 14 : తమ గ్రామాల సమీపంలో పులి సంచరిస్తున్నదని, తీవ్ర భయాందోళన చెందుతున్నామని మండలంలోని కొడిచెర్ల, జల్లాపల్లిఫారానికి చెందని ప్రజలకు భయాందోళన చెందారు. వాట్సాప్ గ్రూపుల్లో పులి సంచరిస్తున్నదన్న వార్తలు, ఫొటోలు వైరల్ కావడంతో అటవీశాఖ అధికారులు గురువారం కొడిచెర్ల శివారు ప్రాంతాన్ని పరిశీలించారు. పొతంగల్ గ్రామానికి చెందిన గుండ్ల సాయిలు చేపలు విక్రయించి బైక్‌పై ఇంటికి తిరుగు ప్రయాణంలో కొడిచెర్ల వెళ్లేదారిలో పులి కనిపించిందని గ్రామస్తులకు తెలిపారు. పులి సంచరించిందని చెప్పిన స్థలాల్లో అటవీ శాఖ అధికారులు గురువారం ఆనవాళ్లను పరిశీలించారు. పులి అడుగుల ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేవని, ఎవరూ భయాందోళన చెందవద్దని అటవీశాఖ బీట్ ఆఫీసర్ వందన తెలిపారు. వారి వెంట పొతంగల్ సర్పంచ్ వర్ని శంకర్, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

## ఇంధన వనరుల పొదుపుపై దృష్టి సారించాలి

సిరికొండ, డిసెంబర్ 14 : సహజ, శక్తి వనరులను పరిమితంగా వాడుకోవాలని, పునరుత్పాదక శక్తివనరులు, ఇంధన వనరుల పొదుపై నవతరం దృష్టి సారించాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని సత్యశోధక్ పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడి, భూతాపం పెరగకుండా సమస్త జీవకోటి మనుగడకు ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు, సిబ్బంది ఇంధన పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు ఈ అంశంపై చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో మెరిసిన జిల్లా క్రీడాకారులు



నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 14 : నేపాల్ దేశంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన డి. సూరజ్ నాయక్, డి.లక్కీరామ్ ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు నేషనల్ టీం మేనేజర్ డి.పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెచ్‌వోడీ వంశీ, ఉపాధ్యాయులతో కలిసి క్రీడాకారులను ఆమె గురువారం సన్మానించారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎల్లారెడ్డిపల్లి విద్యార్థులు




రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఇందల్వాయి, డిసెంబర్ 14 : ఎల్లారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన లావుడియా రాకేశ్, డావుడియా గుర్‌నాథ్ రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తారా చంద్రశేఖర్ తెలిపారు. అండర్-14 బాలబాలికల ఉమ్మడి జిల్లా హాకీ ఎంపిక పోటీలను కామారెడ్డిలో ఈనెల 8న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించగా ప్రతిభ కనబర్చారని చెప్పారు. ఈనెల 16, 17, 18వ తేదీల్లో కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. 13న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల ఉమ్మడి జిల్లా హాకీ ఎంపికలు ఆర్మూర్‌లోని జావిద్‌బాయ్ మినీ స్టేడియంలో నిర్వహించనున్నారని, ఇందులో అవుడియా అరవింద్, బోధన్ మల్లికార్జున్, లావుడియా జీవన్ ఎంపికైనట్లు తెలిపారు. వీరిని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ గుర్రపు నరేశ్, ఎంపీటీసీ తలారి బాబూరావు, ఉపసర్పంచ్ గొల్ల శ్రీనివాస్, వీడీసీ సభ్యులు గురువారం అభినందించారు.

# ప్రజాఉద్యమాల అణచివేతతోనే పార్లమెంట్‌లో నిరసనలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 14 : ప్రజాఉద్యమాలను బీజేపీ ప్రభుత్వం అణచివేయడంతోనే పార్లమెంట్‌లో నిరసన చోటు చేసుకున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. నిరసనకారుల ఘటన కొత్త పార్లమెంట్ భవనం భద్రతను ప్రశ్నించేలా ఉందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక, యువత, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా, ఉద్యమాలను అణచివేయడం ద్వారానే ఢిల్లీలోని పార్లమెంట్‌లోకి పలువురు వెళ్లి స్మోక్‌క్యాన్లను తెరిచి నిరసన తెలిపారని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రతిఒక్కరికీ స్వేచ్ఛ ఉందని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేయాలని అన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు వై.ఓమయ్య, రఘురాం, వెంకటేశం గుప్తా పాల్గొన్నారు.